


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

ఆదివారం 24 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 356 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థల ముందడుగు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 24, ప్రతినిధి: తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోదా ఫౌండేషన్ ప్రభుత్వ విద్యా సంస్థల మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు అందించనున్నాయి. ఈ మేరకు సచివాలయంలో ముఖ్యమంత్రి A. Revanth Reddy సమక్షంలో విద్యాశాఖతో ఆయా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఒప్పంద పత్రాలను రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్‌కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోదా గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు ముఖ్యమంత్రికి అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్‌లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతుల కొత్త ప్రాంగణ నిర్మాణానికి అవసరమైన మొత్తం వ్యయంలో 40 శాతం మేర రూ.19.66 కోట్లను రామ్‌కీ సంస్థ భరించనుంది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీహెచ్ఎస్ ఉన్నతీకరణలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి ఐదో తరగతి, ఇంటర్ తరగతుల నిర్మాణానికి అవసరమైన మొత్తం వ్యయంలో 40 శాతం అయిన రూ.10.4 కోట్లను కూడా రామ్‌కీ సంస్థ అందించనుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతుల నిర్మాణానికి అవసరమైన రూ.50.50 కోట్ల మొత్తాన్ని రహేజా గ్రూప్ భరించనుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్‌నగర్ ఎంపీపీఎస్‌లో ప్రీ ప్రైమరీ, ఆరో, ఏడో తరగతుల నిర్మాణానికి అవసరమైన రూ.12.20 కోట్లను యశోదా హాస్పిటల్స్ అందించనున్నాయి. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## యువ ప్రతిభ వెలికితీతకు యువజన క్రీడా వారోత్సవాలు దోహదం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 24, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన యువజన క్రీడా వారోత్సవాలు ఘన విజయాన్ని సాధించాయని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి క్రీడా మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహణాధికారి, యువజన సేవల కమిషనర్ డాక్టర్ సోనీ బాలాదేవితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాల్లో ఎంపికైన యువతకు నియామక పత్రాలను అందజేయడంతో పాటు, మే 21న నిర్వహించిన క్రీడా దినోత్సవ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు. అలాగే ఆరు రోజులపాటు నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక, యువజన కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉద్యోగ మేళాల్లో భాగస్వామ్యమైన పలు సంస్థల ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మట్టిలో అపార ప్రతిభ కలిగిన యువత ఉన్నారని, అలాంటి ప్రతిభను వెలికితీసి వారికి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. యువతను క్రీడలు, ఉపాధి, వ్యక్తిత్వ వికాసం వైపు మలిచేందుకు 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 99 రోజులపాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువజన క్రీడా వారోత్సవాలు ప్రత్యేక గుర్తింపు సాధించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు, క్రీడాశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ కార్యక్రమాలు విజయవంతమయ్యాయని కొనియాడారు. క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహణాధికారి డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మే 1 నుంచి 11వ తేదీ వరకు జిల్లా కేంద్రాల్లో ఘనంగా ఉద్యోగ మేళాలు నిర్వహించామని తెలిపారు. మే 18 నుంచి 23 వరకు ప్రతి రోజూ ప్రత్యేక అంశాలతో నిర్వహించిన కార్యక్రమాల్లో యువకులు, క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విశేష ఉత్సాహంతో పాల్గొన్నారని పేర్కొన్నారు. క్రీడలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, యువజన చైతన్యం వంటి అంశాలపై నిర్వహించిన కార్యక్రమాలకు పరిశ్రమల శాఖ, సమాచార సాంకేతిక శాఖ, జిల్లా యంత్రాంగం, క్రీడా ప్రాధికార సంస్థ, యువజన సేవల శాఖలు సమిష్టిగా సహకరించాయని వివరించారు. ఈ కార్యక్రమంలో యువజన సేవల శాఖ సంయుక్త సంచాలకుడు వేణుగోపాల్, క్రీడా ప్రాధికార సంస్థ సంచాలకుడు భాషా, తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి మల్లారెడ్డి, డైట్ సంచాలకుడు రాజేశ్వర్ రెడ్డి, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నితిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యువత, విద్యార్థులు, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందని, గ్రామీణ స్థాయి వరకు క్రీడా సంస్కృతిని విస్తరింపజేయడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషించాయని నిర్వాహకులు తెలిపారు.



## ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేస్తాం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 24, ప్రతినిధి: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి Jupally Krishna Rao తెలిపారు. గచ్చిబౌలిలోని జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ ప్రాంగణంలో "గమ్యస్థానం తెలంగాణ – ముందున్న దారి" పేరిట నిర్వహించిన పర్యాటక సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈ సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోని పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని, ప్రైవేట్ భాగస్వామ్యంతో పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం కొత్త పర్యాటక విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిస్తూ, సమగ్ర ప్రాజెక్టు నివేదికలతో ప్రతిపాదనలు సమర్పిస్తే ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పారిశ్రామికవేత్తలకు 'సులభ వ్యాపార విధానం' కింద అన్ని విధాలా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం వినియోగంలో లేని ప్రభుత్వ ఆస్తులను దీర్ఘకాలిక లీజు పద్ధతిలో పర్యాటక అవసరాలకు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరారు. ఎంపిక చేసిన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన సంస్థలకు రూపకల్పనలతో పాటు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, వసతి గృహాలు, భోజనశాలలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితి ఉందని, వాటి అభివృద్ధికి ప్రైవేట్ రంగం ముందుకు రావాలని కోరారు. ఆధునిక వసతులైన చలించే గాజు గృహాలు, వస్త్ర గుడారాల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. పర్యాటక రంగం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాదని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది కీలక రంగమని మంత్రి అన్నారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే అనుబంధ పరిశ్రమలు లాభపడటంతో పాటు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా రాష్ట్రంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే భువనగిరి కోటలో రజ్జుమార్గం ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటుల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రజనీత్ నాయక్, జాతీయ పర్యాటక, ఆతిథ్య నిర్వహణ సంస్థ డైరెక్టర్ వెంకటరమణ, పురావస్తు శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు, Ramoji Film City ఉపాధ్యక్షుడు ఏ. విశ్వంభర రావు, ప్రగతి విహార కేంద్రాల అధినేత జీబీకే రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక సాంకేతికతలను అందించాలి






సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 24, ప్రతినిధి: రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధునిక సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలనే రైతులు సాగు చేయాలని, పంట మార్పిడి విధానాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విత్తన వారోత్సవాలు–2026 కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. తొలుత గత ఏడాది ఏర్పాటు చేసిన డిజిటల్ వ్యవసాయ, సాంకేతిక కేంద్రాన్ని సందర్శించిన మంత్రి ఆధునిక డ్రోన్ల వినియోగంపై జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో కార్మికుల కొరత అధికమయ్యే అవకాశమున్నందున డ్రోన్ల వినియోగం ఎంతో కీలకమని పేర్కొన్నారు. డ్రోన్ ఆధారిత వ్యవసాయ విధానాల రూపకల్పనలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం భారతీయ స్టేట్ బ్యాంకు సామాజిక బాధ్యత నిధులతో అభివృద్ధి చేసిన యాంత్రిక మానవులు, సంకేత ఆధారిత ప్రయోగశాలను సందర్శించి వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన యాంత్రిక పరికరాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత గణాంకాలపై పనిచేస్తున్న పరిశోధనా ప్రయోగశాలను సందర్శించిన మంత్రి, రాష్ట్రంలోని రైతుల యాజమాన్యంలోని భూమిలో సుమారు 9.3 శాతం భూమి సాగులో లేదని శాస్త్రవేత్తలు వివరించారు. '99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన విత్తన వారోత్సవాలను మంత్రి లాంఛనంగా ప్రారంభించి పది మంది రైతులకు వివిధ పంటలకు చెందిన నాణ్యమైన మూల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం విశ్వవిద్యాలయం చేస్తున్న అభినందనీయ కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. కొంతమంది విత్తన కంపెనీల తప్పుడు ప్రచారాలకు మోసపోకుండా రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. 60 ఏళ్ల క్రితం స్థాపించబడిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సహా పలువురు మహానుభావుల సహకారంతో దేశంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో విశ్వవిద్యాలయం మరింత పురోగతి సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో నిరంతరం మమేకమై వారికి అవసరమైన పరిష్కారాలను అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతలను రైతాంగానికి చేరవేయాలని కోరారు. సాగుకు కీలకమైన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలనే లక్ష్యంతో గత ఏడాది నుంచి ఈ విత్తన పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరామ్, డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ చంద్ర మోహన్, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కొప్పుల లక్ష్మి శేషారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 24, వట్టిపల్లి మండల ప్రతినిధి సిహెచ్ బస్వరాజ్ : అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండలం మరవెల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ కమార్ రావుతో కలిసి ప్రారంభించారు. మరవెల్లి గ్రామంలోని ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వారు, రైతులు దళారులు ఇచ్చే తక్కువ ధరలకు మోసపోకుండా ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 3,699కు జొన్నలను విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. ప్రతి రైతు ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు మాత్రమే విక్రయించవచ్చని తెలిపారు. జీవముద్ర ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రైతులు స్వయంగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రైతులు కేంద్ర నిర్వాహకులకు సహకరించి కొనుగోలు కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి, ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులు, యువజన అధ్యక్షుడు వెంకట్ పాటిల్, మాజీ సర్పంచ్ శివచరణ్, డైరెక్టర్లు, సర్పంచులు, మాజీ మండల పరిషత్ సభ్యులు, ప్రశాంత్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు, యువజన ప్రతినిధులు, రైతులు, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం నిర్వాహకుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 24, రిపోర్టర్ వి. సాయి: సంగారెడ్డి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. శనివారం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటా కింద 40 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పటాన్‌చెరు ప్రాంతంలో నెలకొన్న సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యేలు కలెక్టర్‌కు సూచించారు.




# రైతు సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర – బైక్ ర్యాలీ

సందేశం టైమ్స్, పుల్కల్ మండల ప్రతినిధి, మే 24: రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చౌటకూర్ మండల కేంద్రంలో రైతులు భారీ పాదయాత్ర, ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ రహదారి 161పై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని, ఎరువులు, విత్తనాలు సమయానికి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం అందజేయడానికి ప్రయత్నించగా తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రం సమర్పించి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, వివిధ గ్రామాల రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, మే 24: రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా విఫలమైందని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. అధికారం అనుభవించడానికే మంత్రి ఉన్నారని, రైతుల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు అర్జునయ్య, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యుడు సదానందంతో కలిసి వట్పల్లి, అందోల్ మండలాల్లోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద కుప్పలుగా పేరుకుపోయిన వరి ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సుమారు 22 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు సగం ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోయిందని ఆరోపించారు. నెలరోజులు గడిచినా 60 శాతం వరి కొనుగోళ్లు కూడా పూర్తికాలేదని, శనగలు, జొన్నల కొనుగోళ్లకు దిక్కే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గోనె సంచుల కొరత, కూలీల సమస్య, రవాణా ఇబ్బందులు తీవ్రంగా ఉన్నప్పటికీ వాటి పరిష్కారంలో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొనుగోలు ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేవని, కానీ ప్రస్తుతం రైతుల ధాన్యం రోడ్లపై పడితే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. జిల్లాకు అవసరమైన 55 లక్షల గోనె సంచులకు బదులుగా కేవలం 30 లక్షల సంచులు మాత్రమే సరఫరా చేశారని, దీంతో భారీ కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వాహనాల కొరత కారణంగా సగం వాహనాలే కొనుగోలు కేంద్రాలకు చేరుతున్నాయని తెలిపారు. రైతులు తమ చెమటను పెట్టుబడిగా పెట్టి పండించిన ధాన్యాన్ని ఎండలో ఉంచి ప్రభుత్వం వారిని శిక్షిస్తున్నట్లుగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే కొనుగోలు ప్రక్రియ మరో రెండు నెలలు కొనసాగే ప్రమాదం ఉందన్నారు. మరో వారం, పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతుందని, వర్షం పడితే ధాన్యం తడిసి మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కనీసం ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడేందుకు తార్పాలిన్ పట్టాలు సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రి వెంటనే స్పందించి అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చే ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మొద్దు నిద్రలో ఉందని విమర్శించిన ఆయన, యాసంగిలో పండించిన ధాన్యాన్నే కొనలేని ప్రభుత్వం వర్షాకాలంలో వచ్చే పంటను ఎలా కొనుగోలు చేస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం మేల్కొనేలా బీఆర్ఎస్ నాయకులు స్థానిక స్థాయిలో అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతుల ధాన్యం త్వరగా కొనుగోలు అయ్యేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ధాన్యం కుప్ప వద్ద గుండెపోటుతో రైతు మృతి



సందేశం టైమ్స్, కొల్చారం మండల ప్రతినిధి ఈ. శంకర్, మే 24: కొల్చారం మండలం చిన్నఘనపూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శంకరయ్య ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నెల రోజులుగా తన ధాన్యాన్ని ఆరబోసుకొని తూకం కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నాడు. శుక్రవారం ధాన్యం తూకం వేస్తామనే సమాచారం అందడంతో కొనుగోలు కేంద్రానికి చేరుకున్నాడు. ఇదే సమయంలో అక్కడ ఒక్కసారిగా గుండెపోటుకు గురై ధాన్యం కుప్పపై కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యాల వల్ల రైతులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏసీబీ వలలో విద్యుత్ శాఖ అధికారి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గ ప్రతినిధి, మే 24: మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్‌లో విద్యుత్ శాఖకు చెందిన సహాయ విభాగ ఇంజనీర్ ముద్దం రమణారెడ్డి అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కాడు. అధికారిక పనికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడికి సంబంధించిన 11 పనుల బిల్లులను ముందుకు పంపించేందుకు ముద్దం రమణారెడ్డి రూ.25 వేల లంచం కోరినట్లు తెలిపారు. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను విభాగ ఇంజనీర్ కార్యాలయానికి పంపించేందుకు ఈ మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల 40 నిమిషాల సమయంలో తన కార్యాలయంలోనే లంచం స్వీకరిస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉచ్చుపన్ని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులను దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినందుకు సంబంధిత అధికారిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మన్నే సంజీవులకు జన్మదిన శుభాకాంక్షలు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గ ప్రతినిధి, మే 24: మెదక్ జిల్లా చిట్కుల్ గ్రామానికి చెందిన మన్నే బాగయ్య, లింగమ్మ దంపతుల మూడో కుమారుడు మన్నే సంజీవులకు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. చిన్ననాటి నుంచే కుటుంబ సభ్యుల ఆనందాన్ని పంచుకుంటూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్న సంజీవులకు ఆయన మేన బావమరిది మన్నే మారుతి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సంగారెడ్డి జిల్లా వికలాంగుల వర్కింగ్ ప్రెసిడెంట్, మెదక్ నియోజకవర్గ సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నే పోచయ్య మాట్లాడుతూ మన్నే సంజీవులు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. "హ్యాపీ బర్త్‌డే బావ" అంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# రైతు అకాల మరణం వార్తలో నిజం లేదు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గ ప్రతినిధి, మే 24: మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నగణపూర్ గ్రామానికి చెందిన వెంకటాపురం శంకరయ్య అనే రైతు అకాల మరణానికి సంబంధించిన వార్తలను కొన్ని పత్రికలు వాస్తవాలను వక్రీకరించి ప్రచురించాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతు మరణంపై కొల్చారం మండల తహసీల్దార్ సమర్పించిన నివేదిక ప్రకారం సంబంధిత రైతు గుండెపోటుతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు కూడా తెలిపినట్లు పేర్కొన్నారు. రైతు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన క్రమ పద్ధతి ప్రకారమే కొనసాగుతోందని వివరించారు. అయితే కొన్ని దినపత్రికలు ధాన్యం కొనుగోలు సమస్యల కారణంగానే రైతు మృతి చెందినట్లు ప్రచురించడం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. రైతు మరణాన్ని ధాన్యం కొనుగోళ్ల సమస్యలతో ముడిపెట్టి ప్రచారం చేయడం నిరాధారమని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడగా, 30 వేల 210 మంది రైతుల ఖాతాల్లో రూ.336 కోట్ల 65 లక్షలను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ కొనుగోలు కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కావున రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.



# డిజిటల్ ఆరోగ్య ప్రాజెక్ట్ అమలుపై సమీక్ష సమావేశం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 24, ప్రతినిధి: సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో డిజిటల్ ఆరోగ్య ప్రాజెక్ట్ అమలుపై రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అమలులో ఉన్న లోపాలు, అవసరమైన మార్పులు, వ్యవస్థను మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు, సవరణలు, ఇతర ఇబ్బందులపై అధికారులు సమీక్షించి పరిష్కార మార్గాలను నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంతరావు, ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రాజారావు, జాతీయ ఆరోగ్య మిషన్ ముఖ్య సమాచార అధికారి బి. మంజు నాయక్, సహాయ ఆచార్యుడు రవితేజ, డాక్టర్ మారుతి రెడ్డి, మసూద్ ఖాన్, డాక్టర్ శశాంక్, శృతి, మందారిక తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనుమతితో జిల్లా మాస్ మీడియా అధికారి ఈ వివరాలను వెల్లడించారు.

# 137 మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 24, ప్రతినిధి: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8న నిర్వహించిన ఉద్యోగ మేళాలో వివిధ ప్రముఖ సంస్థలకు ఎంపికైన 137 మంది యువతకు శనివారం కలెక్టరేట్ ఫిర్యాదుల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఉద్యోగ మేళాల ద్వారా ప్రైవేట్ రంగ ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే భవిష్యత్తులో మరింత మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువత తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ ప్రధాన నిర్వాహణాధికారి తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



# టీజీఎస్ ఆర్టీసీ ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 24, ప్రతినిధి: ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా టీజీఎస్ ఆర్టీసీ మెదక్ ప్రాంతం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని ఎనిమిది డిపోల నుంచి 75 మంది మహిళా, పురుష క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మహిళలు, పురుషులకు సంయుక్తంగా 100 మీటర్ల పరుగుపందెం, షటిల్ పోటీలు నిర్వహించగా, మహిళా ఉద్యోగుల కోసం సంగీత కుర్చీ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. షటిల్ పురుషుల విభాగంలో సంగారెడ్డి డిపో ప్రథమ స్థానం సాధించగా, జహీరాబాద్ డిపో ద్వితీయ స్థానం దక్కించుకుంది. 100 మీటర్ల పరుగుపందెం మహిళల విభాగంలో గజ్వేల్ డిపో ప్రథమ స్థానం, మెదక్ డిపో ద్వితీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో నారాయణఖేడ్ డిపో ప్రథమ స్థానం గెలుచుకుంది. సంగీత కుర్చీ పోటీల్లో మెదక్ డిపో మొదటి స్థానంలో నిలిచింది. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రాంతీయ మేనేజర్ విజయభాస్కర్ నగదు బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రాంతీయ మేనేజర్లు, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్, జహీరాబాద్ డిపో మేనేజర్‌తో పాటు అధిక సంఖ్యలో ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# యువకుడి హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

సందేశం టైమ్స్, కోదాడ, మే 24, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గణపవరం గ్రామ శివారులో ఈ నెల 15న జరిగిన యువకుడు బలుగురి గణేష్ హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోదాడ విభాగ ఉప పోలీసు అధికారి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గణపవరం గ్రామ శివారులో యువకుడు హత్యకు గురైన ఘటనను పోలీసులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని క్లూస్ బృందం, ప్రత్యేక దర్యాప్తు బృందాల సహాయంతో సాంకేతిక ఆధారాలను సేకరించి విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గరిడేపల్లి మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన పగిళ్ల ఉదయ్ కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. వ్యక్తిగత ఫోటోల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా ప్రధాన నిందితుడు బర్రెంకుల సోమేష్ తన స్నేహితుడి సహాయంతో మృతుడిని నిర్మానుష్య ప్రాంతానికి పిలిపించి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో సహకరించిన మరో ఇద్దరిని కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సంఘటన స్థలం నుంచి రక్తపు మరకలతో ఉన్న రాయి, కత్తి, మొబైల్ ఫోన్లు తదితర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సోమేష్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఉప పోలీసు అధికారి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఏర్పడే పరిచయాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## మత్తు పదార్థాలపై ఉక్కుపాదం అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, కోదాడ, మే 24, ప్రతినిధి: కోదాడ పట్టణంలో మత్తు పదార్థాలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారి నరసింహ ఆదేశాల మేరకు యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా, మంచి భవిష్యత్తు దిశగా ఎదగాలని సూచిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. కోదాడ పట్టణంలోని బస్టాండ్ సెంటర్, రంగ థియేటర్ వీధి, పూల దుకాణాలు తదితర ప్రాంతాల్లో పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలతో కలిసి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వివరించి అవగాహన కల్పించారు. పట్టణంలోని పలు షాపులు, రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రజలకు అవగాహన సందేశాలు ఇచ్చారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవాలని పోలీసులు సూచించారు.



## న్యాయం కోరిన రైతులపై కేసులా? ప్రభుత్వం తీరుపై లింగాల కమల్ రాజు ఆగ్రహం

సందేశం టైమ్స్, మధిర, మే 24, ప్రతినిధి: నెల రోజులుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జడ్పీ మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్చార్జి లింగాల కమల్ రాజు తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలపై దున్నపోతుపై వర్షం కురిసినట్లుగా స్పందిస్తోందని ఆయన మండిపడ్డారు. మొక్కజొన్న కొనుగోలు విషయంలో అధికారులు పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. కడుపు మంటతో రైతులు ఆందోళనకు దిగితే వారిపై అక్రమ కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. చింతకాని మండల రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, పొనుగోటి రత్నాకర్, గురజాల హనుమంత రావు, బొగ్గారపు రాంబాబు, గడ్డం శ్రీనివాసరావు, పిన్నెల్లి శ్రీనివాసరావు, చంద్రయ్య, చిట్టుమోదు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ విఓఏల నిరవధిక సమ్మె – డిమాండ్ల పరిష్కారం కోసం చింతకాని జేఏసీ ఆందోళన



సందేశం టైమ్స్, చింతకాని, మే 24, ప్రతినిధి: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఐకేపీ విఓఏల చింతకాని మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విఓఏలకు కనీస వేతనం ఇరవై వేల రూపాయలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, అర్హులైన విఓఏలకు సీసీగా పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య బీమా ఇరవై లక్షల రూపాయలకు పెంచాలని, ట్యాబ్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య యాభై ఎనిమిది సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు కంచుమర్తి మాజును, కార్యదర్శి అరుణ, ఉప కార్యదర్శి చిర్ర నవనీత, కోశాధికారి ధనలక్ష్మి, నాగేశ్వరి, పుష్ప, నాగమణి, రిజ్వానీ, ఫాతిమా, కృష్ణవేణి, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సర్పంచును దుర్భాషలాడటం హేయమైన చర్య

సందేశం టైమ్స్, మధిర, మే 24, ప్రతినిధి: మధిర మండలం మల్లారం గ్రామంలో మహిళా సర్పంచును అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఘటనను సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు తీవ్రంగా ఖండించారు. గ్రామంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా సుమారు ఇరవై ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన పనులు ఐటిడిఏ సహాయ ఇంజనీర్ యశ్వంత్ ఆధ్వర్యంలో గ్రామంలో కొలతల ప్రక్రియ ప్రారంభం కావడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులను తీసుకువచ్చి పనులు చేపట్టినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై గ్రామ ప్రజలు, సర్పంచ్ మందడపు లక్ష్మి, వార్డు సభ్యులు సంబంధిత సమాచారం గ్రామపంచాయతీకి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించగా, కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి కారణంగా సమాచారం ఇవ్వలేకపోయామని అధికారులు అంగీకరించి పనులను నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్పంచును లక్ష్యంగా చేసుకొని అసభ్య పదజాలంతో అవమానకరంగా మాట్లాడటం తీవ్ర దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ప్రజాప్రతినిధిపై ఇలాంటి ప్రవర్తన హేయమైన చర్యగా భావించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## యువజన మరియు క్రీడా వారోత్సవాల్లో ఉద్యోగ సాధన కార్యక్రమం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 24, ప్రతినిధి: ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మరియు క్రీడా వారోత్సవాల్లో ఆరవ రోజు ఉద్యోగ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మే 1 నుంచి మే 12 వరకు నిర్వహించిన ఉద్యోగ మేళాల్లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మే 2న నల్లగొండలో ఉద్యోగ మేళా నిర్వహించగా, ఇందులో సూర్యాపేట జిల్లాకు చెందిన 89 మంది నిరుద్యోగ యువత వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఉద్యోగాలు సాధించిన యువతకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. అలాగే సీఎంస్ కప్ రెండవ ఎడిషన్ చెస్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పతకం సాధించిన ఓరుగంటి అనంతలక్ష్మిని సన్మానించి ఐదు వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి పర్యవేక్షించారు.

## పోలీసులపై వేధింపుల ఆరోపణలు – డిజిపికి మహిళ దరఖాస్తు

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 24, ప్రతినిధి: ఖమ్మం అర్బన్ ప్రాంతానికి చెందిన కూరపాటి పద్మజ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు దరఖాస్తు సమర్పించారు. తనను ఖమ్మం పట్టణ పోలీసు అధికారులు అనవసరంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. కుటుంబ బంధువుల మధ్య 65 లక్షల రూపాయల అప్పు వివాదంలో తనను అనవసరంగా ఇరికిస్తూ పలు పోలీస్ స్టేషన్లకు పిలిపించి ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి తాను చట్టపరంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రైవేట్ వ్యక్తుల ఒత్తిడి మేరకు పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గతంలో కూడా తనపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేసినట్లు ఆమె ఆరోపించారు. ఒకే విషయంపై టూ టౌన్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయం, అర్బన్ పోలీస్ స్టేషన్‌లకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె డిజిపిని కోరారు.

## గురిందర్‌వీర్ సింగ్ జాతీయ రికార్డు బద్దలు – వంద మీటర్ల పరుగులో 10.09 సెకన్లలో విజయం



సందేశం టైమ్స్, మే 24, ప్రతినిధి: భారత అథ్లెట్ గురిందర్‌వీర్ సింగ్ జాతీయ స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ సమాఖ్య పోటీల్లో వంద మీటర్ల పరుగును కేవలం 10.09 సెకన్లలో పూర్తి చేసి జాతీయ రికార్డును బద్దలు కొట్టాడు. అత్యుత్తమ వేగంతో ప్రదర్శన కనబరిచి దేశవ్యాప్తంగా అథ్లెటిక్స్ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించాడు.ఈ సందర్భంగా గురిందర్‌వీర్ సింగ్ మాట్లాడుతూ తన కోచ్ ఎంతో కష్టపడి తీవ్ర శిక్షణ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన రిలయన్స్ ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎప్పుడూ తనకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.